


కృష్ణమూర్తి:

కళ్ళు మూతలు పడిపోతున్నాయంటే దానికి కారణాలు రెండు. ఆకలేస్తోంది; నిద్రొస్తోంది. నిద్ర పోతే, ఆకలినుంచి కొంచెం దూరం కావచ్చు, కానీ... నిద్రపోవటం అంటే...

వద్దు-బహుశా నా జీవితంలో ఇంక కన్ను మూసి ఆదమరచి నిద్రపోగలిగే ఆ రోజులు పోయినట్లు ఉన్నాయి. కన్ను మూస్తే ఏ అవాంతరం ఏ రూపంలో వచ్చి మీద పడుతుందో నన్న భయమే!

నిన్నటి వరకూ భయమంటే ఎరగని వాణ్ణి.

ఈ రోజు... ఈ క్షణంలో... ఇలా ఊరికి దూరంగా, మనుషులకు దూరంగా, జంతుసమానంగా ఈ ఊడల మర్రికింద, అనామకుడిగా బతకటం ఆశ్చర్యంగా ఉంది, బాధగా ఉంది. కానీ... ఏమిటో, భయం నన్ను ఇలా మార్చేసింది.

ఈ భయం ఇంతలా నన్ను చంపుకు తినేస్తుందని నాకు తెలిసిఉంటే, బహుశా ఆ పని నేను చేయగలిగేవాణ్ణికాను. కానీ, భయం వేరు, ధైర్యం వేరు. ఆ క్షణంలో నన్ను ఆవహించిన ఆ వెర్రి ఆవేశం నన్ను ధైర్యవంతుణ్ణి చేసింది. అందుకే...

ఏమిటో, ఒకటే ఆకలిగా ఉంది...

కళ్ళన్నీ తిరుగుతూ... ఇదే చివరిసారి ప్రపంచాన్ని చూడటమా అన్నంత బాధ....

ఈ ఆకలిబాధ భరించలేకే ఆ రోజున... అయినా కళ్ళు మూసినా కనిపిస్తున్న పీడకల!

– రోజంతా ఆ జంక్షన్‌లోనే నిలబడ్డాను. పొద్దున్న నుంచీ ఒకటంటే ఒక్క బేరమూ తగలలేదు. ఒక్క బేరం దొరికివుంటే, ఏదో ఈ పూటకింత గంజి దొరికేది.

కానీ...తూర్పున ఉదయించే సూర్యుడు పడమటివైపు కుంగిపోవటం నాకు కనిపిస్తూనే ఉంది. నా కడుపులో పేగులు లుంగలు చుట్టి నన్ను మరింత క్రుంగదీయటం నాకు తెలుస్తూనే ఉంది. ఇంట్లో నా చిన్న ప్రాణాలు... ఏమో, ఊహించుకోవటం కూడా కష్టమే!

అందుకే చీకటిపడ్డాక, నా మనస్సును కొంచెం మభ్యపెట్టి, రిక్షాను, ఓపక్క నిలబెట్టి పైపులైనుమీంచి ఆ ఇంట్లోకి దూరాను. చేస్తున్నది తప్పుపని అని తెలిసినా, తప్పనిసరి. రెండు రోజులకు సరిపడే... రేపు ఎలాగయినా రిక్షా తొక్కలేనన్నది నిజం! పప్పులు, బియ్యం మూటగట్టుకొన్నాను. ఎక్కిన దారి వెంబడే దిగుతోంటే కింద నా కోసం కాపేశాడన్న సంగతి నాకేం తెలుసు? వెళ్ళి అతని ముందు నిలబడ్డాను.

దొంగతనం చేసేంత ధైర్యం లేని వాణ్ణి–కానీ దొంగతనాన్ని చేయనే చేశాను. చేసి; దొరికిపోయాను. దొరికిపోవటం నా దౌర్భాగ్యం!

– చేతిలో వున్న వస్తువులు నా దొంగతనానికి సాక్ష్యం చెబుతూ, నా చేతకాని తనాన్ని చాటి చెబుతున్నాయి.

పోలీసు వెంట మౌనంగా పోలీసు స్టేషన్‌కు నడిచాను.

– అప్పటివరకూ నాలో వున్న ఆ మొండితనం ఆవిరిలా ఎటు మాయమైపోయిందో తెలీటంలేదు. అన్ని పక్కల నుంచీ నన్ను అవమానం ఆవరించి వేసింది.

అందుకే... మర్నాడు పోలీసు స్టేషన్ నుంచి కోర్టుకు వెళ్ళబోయే సమయంలో... అదనుచూసి పారిపోయాను.

– ఇప్పుడు ఇక్కడ ఇలా... ఏమిటో, ఏం చేయాలని బయలుదేరితే, ఏం జరుగుతోంది?

కడుపునిండా కూడుకోసం ఎన్ని అవస్థలు??

జేబులో ఉన్న పైసలు లెక్కవేస్తే, ఇరవై రెండున్నాయి. ఈ ఇరవైరెండు పైసలతో ఓ రొట్టెముక్క కొనుక్కుంటే...? కొనుక్కోవచ్చు. కానీ – ఊళ్ళోకి వెడితే... ఎవరైనా పోలీసులు చూస్తే...?

భయం.. ఆకలి.. ఒకదాన్ని మించి ఇంకొకటి నన్ను ఆక్రమించుకొంటున్నాయి.

అయినా ఆకలిముందు భయం ఓడిపోవటంతో ముందుకు నడిచాను.

ఊరంతా మామూలుగానే ఉంది. నేను పారిపోవటం పెద్ద సంచలనాన్ని కలిగించనేలేదు. అందుకే – వెళ్ళి ఓ రొట్టెముక్క కొని, తిరిగి వచ్చేశాను ఊడల మర్రి కిందకు. పొట్లం విప్పి రొట్టిముక్క ఆదరాబాదరాగా తినేశాను. తిన్నాక ఏం చేయాలో తెలీక, ఆ పొట్లం కాగితాన్ని విప్పాను. చదునుచేసి ఒక్కో అక్షరం చదవటం మొదలు పెట్టాను.

ఆ పేపర్లో వార్త చదివేసరికి, నా గుండెలు అవిసిపోయాయి.

ఎందుకిలా జరిగిపోయింది?

<u>*రంగమూర్తి:*</u>

- ఎంత అవమానం జరిగిపోయింది?

ఈ ముఖంతో ఇంక ఎవర్నయినా ఎలా చూడాలి? ఇన్నేళ్ళ తర్వాత జీవితంలో ఇలాంటి సంఘటన.. అయినా ఎలా జరిగింది?

ఆ రోజు... మామూలుగా బీటు నాదే... మామూలుగా అలవాటైన దారి. అలవాటైన కళ్ళు. పరధ్యానంగా నడుస్తూనే ఉన్నాను. కానీ దృష్టి ఎంతైనా పోలీసు దృష్టేకదా! అందుకే కాబోలు, ఆ చీకటిచాటున రిక్షా నాకళ్ళపడనేపడింది.

చీకటిచాటు రిక్షా అంటే తెలుస్తూనే ఉంది, దాని స్వభావం ఏమిటో!

ఏ ఆడకూతురో తన ఆడతనాన్ని అమ్ముకోవటానికి వచ్చి వుంటుంది. అంతకన్నా ఆ రిక్షాలో ఇంకేం ఉంటుంది? రిక్షాలో ఆడది కూర్చొని ఉంటే, రిక్షావాడు బేరం కుదుర్చుకొని వస్తాడు.

ఇది మామూలు కథే నాకు తెలుసు, అందరికీ తెలుసు, హెడ్డు నారాయణ స్వామికీ తెలుసు. యస్సై వెంకటాచారికి తెలుసు. కానీ వాళ్ళు ఇద్దరూ కళ్ళు మూసుకుంటారు, 'రంగమూర్తీ, కన్ను తెరిస్తే నేరమే కనబడుతుంది. అందుకే మూసుకోవాలి!' అంటాడు నారాయణ స్వామి, కానీ చేసేది కళ్ళు మూసుకోగలిగే ఉద్యోగం కాదు.

అందుకే-రిక్షాకేసి నడిచాను. ఆశ్చర్యం! రిక్షా ఖాళీగా ఉంది. అంటే బేరం కుదిరే ఉంటుంది. బ్రోతల్ యాక్టు ఉన్నా లాభం లేదు, మనిషిలో రావాలి మార్పు.

అక్కడే కాపలా వేసాను. క్షణం తర్వాత తలెత్తి చూశాను. పై నుంచి దిగుతూ, దొంగవెధవ!! రిక్షా ఉండి కూడా దొంగతనం - మనుషులకు 'ఈజీమనీ' అంటే ఎంత కోరికో?

కిందకు దిగగానే పట్టుకున్నాను. వాడిచేతిలో ఉన్నవి - పప్పులు, బియ్యం... బాధ కలిగింది... కానీ దొంగతనం దొంగతనమే!

దొరికిన దొంగ మౌనంగానే వచ్చాడు. నాతో స్టేషన్‌కు,

మౌనం మౌనంగా ఉండదనీ, మర్నాడో, రెండు రోజుల తర్వాతో బాంబులా పేలబోతోందని నాకే తెలుసు?

ఆకలి కోసం చేసిన దొంగతనం మీద గౌరవం కొద్దీ... కొంచెం అజాగ్రత్తగానే ఉన్నానేమో! లేకపోతే నామీద నాకే ఆత్మవిశ్వాసం బలిసి పోయిందేమో, తెలీదు, కోర్టుకు వెడుతోంటే దొంగ పారిపోయాడు!

ఎంత ఘోరం జరిగిపోయింది! ఇన్నేళ్ళ నా సర్వీసు వృధా అయిపోయింది. మచ్చలేని నా సర్వీసులో బ్లాక్‌మార్క్ పడిపోయింది. జీవితంలో ఏ పోలీసుకైనా ఇంతకన్నా ఓటమి ఇంకోటి ఉండదు. హెడ్డుకు చెబితే, హెడ్డు యస్సైకి చెబితే అలా అంచెలంచెలుగా చివరకు... సస్పెన్షన్ ఆర్డరు వస్తుంది. అది శిక్ష కానేకాదు!

కానీ- ఈ అవమానం.. నేను భరించలేనిది.

ఈ ఓటమిలోంచి నేను నేను తల ఎత్తుకోలేను.

అందుకే... కోర్టు ఆవరణకు చేరాక, ఆ చెట్టు కింద, ఈ అవమానాన్ని భరించలేక నేను తుపాకీ తీశాను. గురిచూసుకొని ఒక్క గుండు పేల్చాను.

– ఆ గుండు నా గుండెల్లోకి దూసుకుపోయింది.

అవమానం కన్నా ఇదెంత హాయిగా ఉంది!!

<u>కృష్ణమూర్తి:</u>

– మనిషి ఆకలికి తట్టుకోలేక చేసేదీ నేరమే అవుతుందా? తనకు తెలీదు. కోర్టులో కూర్చొన్న ఆ పెద్దలకు తెలుసో, లేదో తనకు తెలీదు.

దొంగతనం చేసిన మాట వాస్తవమే గానీ, దానిక్కారణం ఎవరికీ అక్కర్లేదు.

– అలాగే కారణాన్ని శిక్షించలేని వాళ్ళు తన్ను శిక్షించటం జరుగుతోంది! అందుకే శిక్షనుంచి దూరంగా పారిపోయి, ఈ ఊడల మర్రికింద...

కానీ, పేపరు ఏం చెబుతోంది!

తను తెలిసి తెలిసీ చేసిన తప్పు కానేకాదు.

పారిపోతున్న క్షణంలో పోలీసు గురించి తను ఆలోచించి ఉంటే...? ఆ పోలీసు, తను పారిపోవటం అవమానంగా భావించి, ఆత్మహత్య చేసుకోవటం! ఊహూ.. ఇది అన్యాయం.

దొంగతనం చేసింది తను. శిక్ష పోలీసుకు అయింది. అయినా ఎంత గొప్ప వ్యక్తి - ఉద్యోగ నిర్వహణలో లోపం జరిగిందని ఆత్మహత్య చేసుకోవటం... ఎంత గొప్పపని?

ఆ పోలీసెవరో తనకు తెలీదు. కానీ, ఎంత గొప్ప పాఠం నేర్పాడు అతను!

ఆ కాగితాన్ని చేత్తో పట్టుకుని ముందుకు, నడిచాను. చనిపోయిన ఆ పోలీసు దారి చూపిస్తోంటే!

అరగంట తర్వాత పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కి, లోపలకు అడుగు పెట్టగానే, యస్సై నన్ను చూసి నిలబడ్డాడు.

నాకు తెలుసు జైలు గదులంటే చీకటి కొట్టాలని! కానీ ఆ చీకటి గదులలో నాకోసం కొండంత వెలుగు కాచుకొని ఉందన్న సంగతి ఎందరికి తెలుసు?

– *ప్రజాతంత్ర, జనవరి 1977*